ఫుట్‌పాత్‌లు ఆక్రమిస్తే కఠిన చర్యలు

కుషాయిగూడలోని శివసాయినగర్‌కు వెళ్లే రహదారిలోని ఫుట్‌పాత్‌పై వెలిసిన అక్రమ నిర్మాణాలను తొలగిస్తున్న సిబ్బంది

చర్లపల్లి, జూలై 31: కాప్రా సర్కిల్ పరిధిలో ఫుట్‌పాత్‌లను ఆక్రమించి నిర్మాణాలు చేపడితే కఠిన చర్యలు తీసుకుంటామని కాప్రా సర్కిల్ డిప్యూటీ కమిషనర్ ముకుందర్‌రెడ్డి పేర్కొన్నారు. చర్లపల్లి డివిజన్ పరిధిలోని కుషాయిగూడలోని శివసాయినగర్‌కు వెళ్లే రహదారిలోని ఫుట్‌పాత్‌లో వెలిసిన అక్రమ నిర్మాణాలను డిప్యూటీ కమిషనర్ ముకుంద్‌రెడ్డి అదేశాల మేరకు సిబ్బంది కూల్చివేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్కిల్ పరిధిలో అక్రమ నిర్మాణాలు చేపడితే నిర్ధాక్షిణ్యంగా కూల్చివేస్తామని ఆయన హెచ్చరించారు. ఫుట్‌పాత్‌లను ఆక్రమించి ట్రాఫిక్ సమస్యలకు కారణమవుతున్న వాణిజ్య దుకాణాల ముందు పెడ్లను తొలగిస్తున్నామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్కిల్ ఏసీపీ గిరిరాజు, నాక్ ఇంజనీర్ యోగి, అశ్విన్, గంగాధర్, రాజు, కుషాయిగూడ పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు ప్రారంభం

అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణ పనులను ప్రారంభించిన చైర్‌పర్సన్ మర్రి దీపికానర్సింహా రెడ్డి

మేడ్చల్, జూలై 31 : మేడ్చల్ మున్సిపాలిటీ పరిధిలోని 8వ వార్డులో రూ.10 లక్షలతో చేపట్టిన అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులు, రూ.23 లక్షలతో చేపట్టిన సీసీ రోడ్డు పనులను మున్సిపాలిటీ చైర్‌పర్సన్ మర్రి దీపికానర్సింహా రెడ్డి బుధవారం కౌన్సిలర్ నాగరాజు ముదిరాజ్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ అన్ని వార్డుల్లో మౌలిక వసతుల కల్పనే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామన్నారు. అందులో భాగంగానే సీసీ రోడ్డు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణ పనులు చేపట్టామన్నారు. కార్యక్రమంలో నాయకుడు వేముల శ్రీనివాస్ రెడ్డి, స్థానికులు పాల్గొన్నారు.

యూజీడీ పనులు ప్రారంభం

అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పనులను ప్రారంభిస్తున్న చైర్మన్ చంద్రారెడ్డి

మేడ్చల్ కలెక్టరేట్, జూలై 31: నాగారం మున్సిపాలిటీ పరిధిలోని 16వ వార్డులోని చండీశ్వరీ కాలనీలో మున్సిపాలిటీ సాధారణ నిధులు రూ.12 లక్షలతో చేపట్టిన అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులకు చైర్మన్ కౌకుంట్ల చంద్రారెడ్డి బుధవారం శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ మల్లేశ్ యాదవ్, నాయకులు జగన్‌మోహన్ రెడ్డి, సుధాకర్ రెడ్డి, కాలనీవాసులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలి

ఇంటర్నేషనల్ అవార్డు అందుకున్న ఉపాధ్యాయులతో కార్పొరేటర్ శ్రీదేవి

చర్లపల్లి, జూలై 31: ఉపాధ్యాయులు విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని డివిజన్ కార్పొరేటర్ బొంతు శ్రీదేవి సూచించారు. డివిజన్ పరిధిలోని చర్చి కాలనీలోని సెయింట్ జోసెఫ్ బెత్తాని నవజీవన్ విద్యాలయ స్కూల్ ఇంటర్నేషనల్ స్కూల్ అవార్డుతో పాటు ఐదు విభాగాల్లో అవార్డులు పొందిన సందర్భంగా నిర్వహించిన వేడుకల్లో కార్పొరేటర్ బొంతు శ్రీదేవి పాల్గొన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు,నాయకులు పాల్గొన్నారు.

అక్రమంగా అరెస్టులు చేయడం సరికాదు..

హబ్సిగూడలో హౌస్ అరెస్టు చేయడంపై మాట్లాడుతున్న కార్పొరేటర్ చేతన

రామంతాపూర్,జూలై 31 : రాష్ట్రంలో మహిళలపై జరగుతున్న అత్యాచారాలను నిరసిస్తూ అసెంబ్లీ ముట్టడికి వెళ్లుతున్న తమను పోలీసులు ఉదయం హౌస్ అరెస్టు చేయడం సరైన చర్యకాదని హబ్సిగూడ, రామంతాపూర్ డివిజన్ల కార్పొరేటర్లు కక్కిరేణి చేతన హరీశ్, బండారు శ్రీవాణి వెంకట్‌రావు బుధవారం తీవ్రంగా ఖండించారు. రాష్ట్రంలో మహిళలపై అత్యాచారాలు జరగుతున్నా ప్రభుత్వం పట్టించుకోక పోవడం దారుణమన్నారు. ప్రభుత్వం వెంటనే శాంతి భద్రతలు కాపాడి ,మహిళలపై అత్యాచారాలు అరికట్టాలన్నారు.

తూంకుంటలో శామీర్‌పేటను విలీనం సరికాదు

శామీర్‌పేట, జూలై 31:మండల కేంద్రమైన శామీర్‌పేట గ్రామాన్ని తూంకుంట మున్సిపాలిటీలో విలీనం చేస్తామని వస్తున్న వార్తలు, వందంతులను తీవ్రంగా ఖండిస్తున్నామని మాజీ ఎంపీపీ, జిల్లా ఎంపీపీల ఫోరం అధ్యక్షురాలు దాసరి ఎల్లూభాయిబాబు అన్నారు. శామీర్‌పేటలో బీఆర్ఎస్ తరపున బుధవారం నిరసన వ్యక్తం చేశారు. శామీర్‌పేట పంచాయతీని తూంకుంట మున్సిపాలిటీలో విలీనం చేస్తామనడం సరికాదన్నారు.ఈ విషయాన్ని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, ఎమ్మెల్యే మల్లారెడ్డి దృష్టికి తీసుకెళ్లి పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామన్నారు.కార్యక్రమంలో జిల్లా ఎంపీపీ ఫోరం అధ్యక్షురాలు ఎల్లూభాయిబాబు, శామీర్‌పేట గ్రామ ఉపాధ్యక్షుడు సత్యనారాయణ, మాజీ వార్డు సభ్యులు శ్రీకాంత్‌గౌడ్, పార్టీ నాయకులు పవన్‌ముదిరాజ్, రవి, బద్రీ, శేఖర్, మహేశ్, కుమార్, అంజిరెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న జిల్లా ఎంపీపీల ఫోరం అధ్యక్షురాలు ఎల్లూభాయిబాబు.

కెప్టెన్ వీర రాజారెడ్డి అందరికీ ఆదర్శం

వీరరాజారెడ్డి విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, తదితరులు

రామంతాపూర్,జూలై 31: దేశానికి సేవలు చేసే క్రమంలో వీరమణం పొందిన కెప్టెన్ వీరరాజారెడ్డి అందరికీ ఆదర్శంగా నిలిచాడని ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. బుధవారం హబ్సిగూడ చౌరస్తాలో కెప్టెన్ వీర రాజారెడ్డి వ వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి, మాజీ ఎమ్మెల్యే భేతి సుభాష్‌రెడ్డి, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు రాగిడి లక్ష్మారెడ్డి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు సోమిరెడ్డి, లక్ష్మీనారాయణ, మాజీ కౌన్సిలర్లు కైలాస్‌పతి గౌడ్,వీరేందర్,శ్యామ్,రాజమోహన్‌రెడ్డి, కుటుంబసభ్యులు మురళిధర్,సుచిత్రరెడ్డి,విశ్వేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎర్రపోచమ్మకు ఎమ్మెల్యే పూజలు

మీర్‌పేట్ హెచ్‌బీకాలనీ డివిజన్ రాజీవ్‌నగర్‌లో శ్రీ ఎర్రపోచమ్మ అమ్మవారి శిలావిగ్రహ ప్రతిష్ఠా మహోత్సవం బుధవారం వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, స్థానిక కార్పొరేటర్ జే.ప్రభుదాస్, మాజీ కార్పొరేటర్ జి.శ్రీనివాస్‌రెడ్డి హాజరై ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక బీఆర్ఎస్ నాయకులు, కాలనీవాసులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

కలెక్టర్ దృష్టికి కార్పొరేషన్ సమస్యలు

బోడుప్పల్, జూలై31: బోడుప్పల్ నగరపాలక సంస్థ మేయర్ తోటకూర అజయ్‌యాదవ్ బుధవారం కలెక్టర్ గౌతమ్‌ను కలిశారు. బోడుప్పల్ కార్పొరేషన్‌ను అభివృద్ధి పథంలో తీసుకెళ్లడానికి అన్నివిధాల సహకారం అందించాలని కలెక్టర్ గౌతమ్‌ను పాలకవర్గంతో కలిసి కోరినట్లు మేయర్ అజయ్‌యాదవ్ తెలిపారు. కార్పొరేషన్‌లోని ప్రధాన సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లగా ఆయన సానుకూలంగా స్పందించినట్లు వెల్లడించారు.కలెక్టర్‌ను కలిసిన వారిలో డిప్యూటీ మేయర్ ప్రవంతికిశోర్‌గౌడ్, కార్పొరేటర్లు కిరణ్‌కుమార్‌రెడ్డి, పద్మారెడ్డి,నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు ప్రారంభించిన మేయర్

బోడుప్పల్ కార్పొరేషన్‌ను అన్నివిధాల అభివృద్ధి పథంలో నడిపించడమే లక్ష్యమని మేయర్ తోటకూర అజయ్‌యాదవ్ తెలిపారు. నగరపరిధిలోని 24వ డివిజన్‌లోని జ్యోతినగర్ కాలనీలో రూ.40లక్షల నిధులతో చేపట్టనున్న సీసీరోడ్డు పనులను కార్పొరేటర్‌రమావెంకటేశ్‌యాదవ్‌తో కలిసి ప్రారంభించారు.కార్యక్రమంలో డీఈ చిరంజీవి, మున్సిపల్ అధికారులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన బోడుప్పల్ కార్పొరేషన్ మేయర్ అజయ్‌యాదవ్,పాలకవర్గసభ్యులు

నేటి నుంచి తల్లి పాల వారోత్సవాలు

మేడ్చల్ కలెక్టరేట్, జూలై 31: అంతర్జాతీయ తల్లిపాల వారోత్సవాలను పురస్కరించుకొని ఈనెల1వ తేదీ నుంచి 7వ తేదీ వరకు జిల్లా స్థాయిలో ఐసీడీఎస్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో, మండల స్థాయిలో సెక్టార్ పరిధిలో వారోత్సవాలను నిర్వహిస్తున్నట్లు జిల్లా సంక్షేమ అధికారి కృష్ణారెడ్డి తెలిపారు. జిల్లాలో ఉన్న 793 అంగన్‌వాడీ కేంద్రాల్లో ఈ వారోత్సవాలను నిర్వహించి, తల్లిపాల ప్రాముఖ్యతను విస్తృతంగా ప్రచారం చేయనున్నామని తెలిపారు. వైద్య ఆరోగ్య శాఖ, పంచాయతీ, జిలా పరిషత్, డీఆర్‌డీఏ శాఖ సమన్వయంతో ఈ కార్యక్రమాలను నిర్వహించనున్నామని అన్నారు.

రాష్ట్ర స్థాయి క్రికెట్ పోటీల్లో.. మేడ్చల్ విద్యార్థి ప్రతిభ

ఆదిత్య యాదవ్

మేడ్చల్, జూలై 31: రాష్ట్ర స్థాయిలో జరుగుతున్న క్రికెట్ పోటీల్లో మేడ్చల్ విద్యార్థి ప్రతిభ చూపాడు. ఏ2 డివిజన్‌లో 2 డేస్ లీగ్ చాంపియన్‌షిప్ పోటీల్లో బుధవారం విజయనగర్ టీం, హైదరాబాద్ యూనిట్ టీంతో అజీజ్‌నగర్‌లోని బృంద క్రికెట్ గ్రౌం డ్ తలపడింది. విజయ్‌నగర్ టీం తరుపున ఆడిన మేడ్చల్ పట్టణానికి చెందిన విద్యార్థి ఆదిత్యయాదవ్ అద్భుతంగా బౌలింగ్ చేసి, ఆరు వికెట్లు పడగొట్టాడు. దీంతో హైదరాబాద్ యూనియన్ జట్టుపై విజయనగర్ జట్టు 11 పరుగుల తేడా గెలిచింది. ఆదిత్య యాదవ్ ప్రతిభపై కోచ్‌లు ఎండీ మన్సూర్, బుచ్చిబాబు, ప్రశాంత్ హర్షం వ్యక్తం చేశారు. హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్‌కు క్రీడాకారుల ఎంపికే లక్ష్యంగా విద్యార్థులకు తర్ఫీదునిస్తున్నామని తెలిపారు.

వృద్ధ దంపతుల చేరదీత

రామంతాపూర్,జూలై 21: పక్షవాతంతో బాధపడుతూ రోడ్డుపై తిరుగుతున్న వృద్ధ దంపతులను రామంతాపూర్ సురక్షా సేవా సమితి బుధవారం చేరదీసింది. సంస్థ అధ్యక్షురాలు అర్పిత,గ్రూప్ మెంబర్ శివ ప్రసాద్ వారిని కలిసి భోజనానికి డబ్బులు ఇచ్చి కౌన్సిలింగ్ ఇచ్చారు.వివరాలను తెలుసుకున్నారు. తినడానికి తిండి లేక ఇబ్బందులు పడుతున్నామని వారు తెలిపారు. తమ పిల్లలు తమను పట్టించుకోకుండా రోడ్డు పై వదిలేశారని వారు తెలిపారు. వారికి నగరంలో అనాథ సంస్థ ద్వారా ఆశ్రయం కల్పించేందుకు కృషి చేస్తామన్నారు. కన్న తల్లి, తండ్రులను వదిలి వేయడం బాధకల్గించిందన్నారు. వారి కుమారులకు సమాచారం అందిస్తామన్నారు.

సాంకేతిక నైపుణ్యాలను పెంపొందించుకోవాలి

మేడ్చల్, జూలై 31: ప్రస్తుత సమాజంలో సాంకేతికకు ప్రాధాన్యత పెరిగింది, విద్యార్థులు సాంకేతిక నైపుణ్యాలను పెంపొందించుకోవడానికి కృషి చేయాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి సూచించారు. గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ మైసమ్మగూడలోని మల్లారెడ్డి విశ్వవిద్యాలయంలోని స్కూల్ ఆఫ్ ఇంజినీరింగ్‌లోబుధవారంఓరియంటేషన్‌కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజాన్ని శాసిస్తున్న సాంకేతిక నైపుణ్యాలపై పట్టు సాధించడానికి ఇంజినీరింగ్ చేరిన మొదటి ఏడాది నుంచే క్రమశిక్షణతో కష్ట పడాలన్నారు. ఈ నాలుగేళ్ల జీవితమే భవిష్యత్‌ను నిర్ణయిస్తుందని, ఎలాంటి ప్రలోభాలకు లొంగకుండా శ్రమించాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో వీసీ వీఎస్‌కే రెడ్డి, అధ్యాపకులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

యువతి అదృశ్యం

వైష్ణవి(ఫైల్)

మల్కాజిగిరి,జూలై31: యువతి అదృశ్యమైనఘటన మల్కాజిగిరి పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ కథనం ప్రకారం... తుకారంగేట్ గడ్డమీది బస్తీకి చెందిన వైష్ణవి(26) ప్రైవేటు జాబ్ చేస్తుంది.మంగళవారం వైష్ణవితో పాటు తల్లి జానకి కుటుంబ సభ్యులతో కలిసి మల్కాజిగిరికి షాపింగ్‌కు వెళ్లారు. షాపింగ్ అయిన తర్వాత వైష్ణవి కనిపించ లేదు. ఆమె కోసం వెతికినా ఆచూకీ దొరక లేదు.తల్లి జానకి పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

మల్కాజిగిరి, జూలై 31: గుర్తు తెలియన వ్యక్తి మృతి చెందిన సంఘటన మల్కాజిగిరి పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు కథనం ప్రకారం... మౌలాలి షాదుల్లానగర్‌లో రోడ్డ పక్కలో గుర్తు తెలియన వ్యక్తి మృతి చెంది ఉన్నాడని స్థానికులు పోలీసులకు సమాచారం అందజేశారు. వెంటనే సంఘటన స్థలానికి వచ్చిన పోలీసులు మరణించిన వ్యక్తి వద్ద ఎటువంటి ఆధారాలు లభించలేదు. మృత దేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం గాంధీ మార్చురికి తరలించారు. వివరాలు తెలిసిన వారు మల్కాజిగిరి పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలని కోరారు.

ఉప్పల్‌లో బోనాల పండుగకు ఏర్పాట్లు చేయాలి

క్యాంప్ కార్యాలయంలో అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న కార్పొరేటర్ బన్నాల గీతా.

రామంతాపూర్, జూలై 31: ఉప్పల్‌లో జరిగే బోనాల ఉత్సవాలకు భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని బుధవారం చిలుకానగర్ క్యాంప్ కార్యాలయంలో జరిగిన అన్ని విభాగాల అధికారుల సమావేశంలో స్టాండింగ్ కమిటీ మెంబర్ ,కార్పొరేటర్ బన్నాల గీతా ప్రవీణ్ ముదిరాజ్ సూచన లిచ్చారు. రోడ్ల పై ఎక్కడైన గుంతలు ఉంటే వెంటనే బీటీ ప్యాచ్‌లు వేయాలన్నారు. ఆలయాల వద్ద చెత్త ఉండకుండా చర్యలు తీసుకోవాలన్నారు. బ్లీచింగ్ పౌడర్ చల్లి ఆలయాల పరిసర ప్రాంతాలను శుభ్రంగా ఉంచాలన్నారు. భక్తులకు తాగునీటి సౌకర్యం ఏర్పాటు చేయాలన్నారు. రోడ్డుకు అడ్డంగా ఉన్న చెట్లను తొలగించాలన్నారు. ఈ కార్యక్రమంలో డీజీఎం రజనీకాంత్‌రెడ్డి,ఏఈ రవీందర్‌రెడ్డి,ఏఈ రాజ్‌కుమార్,డి చందన,రాజేశ్వర్‌రెడ్డి,ఏఈ నరేశ్‌రెడ్డి,అజయ్, శేఖర్, బాలు, కేదార్ తదితరులు పాల్గొన్నారు.

హక్కుల సాధనకు కృషి చేయాలి

శామీర్‌పేట, జూలై 31: రాజ్యంగం కల్పించిన హక్కులను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ యాదగిరిరెడ్డి సూచించారు.ఉమ్మడి శామీర్‌పేట మండలంలోని శామీర్‌పేట, మూడుచింతలపల్లి, కేశ్వాపూర్, ఆద్రాస్‌పల్లి తదితర గ్రామాల్లో బుధవారం పౌరహక్కుల దినోత్సవం నిర్వహించి ప్రజలకు మానవహక్కులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామాల్లో ప్రతి ఒక్కరు తమ తమ హక్కుల సాధనకు కృషి చేయాలన్నారు. అందుకు అధికారులు, ప్రజాప్రతినిధులు, ప్రజా సంఘాల నేతలు ప్రజలకు ఎప్పటికప్పుడు చైతన్యవంతులను చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ కుమార్, పంచాయతీ కార్యదర్శి వేణుగోపాల్, ఏఎస్ఐ అనిత, తహసీల్దార్ వెంకటనర్సింహారెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ నాగజ్యోతి, ఎంపీడీవో వత్సలాదేవి, ఎంపీవో మంగతాయారు, సునీత, పంచాయతీ కార్యదర్శి

మజీద్‌పూర్ గ్రామంలో మాట్లాడుతున్న తహసీల్దార్ యాదగిరిరెడ్డి.

రాజేశ్వర్‌రెడ్డి, మల్లికార్జున్, ఉషా, మాజీ సర్పంచ్ జాము రవి, మాజీ ఎంపీటీసీ నాగరాజు,దళిత సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

వసతి గృహాల్లో సమస్యలు పరిష్కరించాలి

సమస్యలు పరిష్కరించాలని కోరుతూ అధికారులకు వినతి పత్రం సమర్పిస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

మేడ్చల్ కలెక్టరేట్, జూలై 31: ఎస్సీ, ఎస్టీ, బీసీ సంక్షేమ కళాశాల, గురుకుల వసతి గృహాల్లో సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో బుధవారం డీబీసీడీవో బీసీ కేశవరం, ఎస్సీ సూపరింటెండెంట్ రవీందర్, ఎస్టీ ఏవో పద్మ జలకు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కార్తీక్, సంతోష్ రాథోడ్ మాట్లాడుతూ కనీస వసతులు లేకుండా అద్దె భవనాల్లో నడుస్తున్న వసతిగృహాల్లో విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారన్నారు. ఖాళీగా ఉన్న వార్డెన్ పోస్టులను భర్తీ చేయాలని, ధరలకు అనుగుణంగా మెస్, కాస్మోటిక్ చార్జీలు పెంచాలని, సొంత భవనాలు నిర్మించాలని, కరెంట్, పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యులు శ్యాంరావు, సుబ్బు పాల్గొన్నారు.

ట్రేడ్ లైసెన్స్ మొత్తాన్ని వెంటనే విడుదల చేయాలి

మేడ్చల్ కలెక్టరేట్, జూలై 31: నాగారం మున్సిపాలిటీ రావాల్సిన ట్రేడ్ లైసెన్స్ మొత్తాన్ని వెంటనే విడుదల చేయాలని కోరుతూ చైర్మన్ కౌకుంట్ల చంద్రారెడ్డి బుధవారం మున్సిపల్ శాఖ కమిషనర్, డైరెక్టర్‌ను కలిసి వినతి పత్రం సమర్పించారు. వేరే మున్సిపాలిటీలకు ట్రేడ్ లైసెన్స్‌లకు సంబంధించిన మొత్తం బదిలీ అవుతున్నప్పటికీ నాగారానికి మాత్రం ఇవ్వడం లేదన్నారు.2022-23 నుంచి ఇప్పటి వరకు దాదాపు రూ.90 లక్షలు రావాల్సి ఉందని, వెంటనే మున్సిపాలిటీకి విడుదల చేయాలని కమిషనర్‌ను కోరారు.

మున్సిపల్ శాఖ కమిషనర్‌కు వినతి పత్రం సమర్పిస్తున్న చైర్మన్ చంద్రారెడ్డి

వివిధ కోర్సుల పరీక్షా ఫీజు స్వీకరణ

ఉస్మానియా యూనివర్సిటీ, జూలై 31: ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని వివిధ కోర్సుల పరీక్షా ఫీజును స్వీకరించనున్నట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ రాములు ఒక ప్రకటనలో తెలిపారు. ఎమ్మెస్సీ (ఆడియాలజీ), ఎమ్మెస్సీ (స్పీచ్ లాంగ్వేజ్ ప్యాథలజీ) కోర్సుల రెండు, నాలుగో సెమిస్టర్ రెగ్యులర్, బ్యాక్‌లాగ్, మొదటి, మూడో సెమిస్టర్ బ్యాక్‌లాగ్, ఇంప్రూవ్‌మెంట్ పరీక్షా ఫీజును ఈ నెల 5లోగా సంబంధిత కళాశాలల్లో చెల్లించాలన్నారు. రూ. 300 అపరాధ రుసుముతో 12 వరకు చెల్లించవచ్చన్నారు. ఐదేళ్ల ఇంటిగ్రేటెడ్ ఎంబీఏ కోర్సు రెండు, నాలుగు, ఆరు, ఎనిమిది, పదో సెమిస్టర్ రెగ్యులర్, బ్యాక్‌లాగ్, ఇంప్రూవ్‌మెంట్, మొదటి, మూడు, అయిదు, ఏడు, తొమ్మిదో సెమిస్టర్ బ్యాక్‌లాగ్, ఇంప్రూవ్‌మెంట్ పరీక్షా ఫీజును ఈనెల 12 వరకు సంబంధిత కళాశాలల్లో చెల్లించాలన్నారు. రూ.300 అపరాధ రుసుముతో 17వరకు చెల్లించే అవకాశం ఉంటుందన్నారు. ఈ పరీక్షలను ఈ నెల లోనే నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇతర వివరాలకు ఓయూ వెబ్‌సైట్ www.osmania.ac.inలో చూసుకోవచ్చని సూచించారు.

లివాల్యూయేషన్‌కు దరఖాస్తుల ఆహ్వానం

ఓయూ పరిధిలోని బీఈ (ఏఐసీటీఈ) కోర్సుల పరీక్షా ఫలితాల రీవాల్యూయేషన్‌కు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ రాము లు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కోర్సుల ఎనిమిదో సెమిస్టర్ మెయిన్, బ్యాక్‌లాగ్ పరీక్షా ఫలితాలను ఇప్పటికే విడుదల చేశామని చెప్పారు. విద్యార్థులు తమ మార్కుమెమోలను రెండు వారాల తరువాత నుంచి సంబంధిత కళాశాలల్లో తీసుకోవాలని సూచించారు. ఈ ఫలితాలపై రీవాల్యూయేషన్‌కు దరఖాస్తు చేసుకోవాలనుకుంటే ఒక్కో పేపర్‌కు రూ.800 చొప్పున చెల్లించి, ఈ నెల 6లోగా టీఎస్ ఆన్‌లైన్ కేంద్రాల ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. రూ.200 అపరాధ రుసుముతో 8 వరకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. జవాబు పత్రాల నకలు పొందగోరువారు ఒక్కో పేపర్‌కు రూ.1000 చొప్పున చెల్లించి ఈనెల 8లోగా తమ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

పరీక్షా ఫలితాల విడుదల

ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని హోటల్ మేనేజ్‌మెంట్ కోర్సులు (బీసీటీసీఏ, బీహెచ్ఎంసీటీ) కోర్సుల పరీక్షల రీవాల్యూయేషన్ ఫలితాలతో పాటు బీఫార్మసీ (పీసీఐ) పరీక్షా ఫలితాలను విడుదల చేసినట్లు కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ రాములు ఒక ప్రకటనలో తెలిపారు.

పరీక్షా తేదీల ఖరారు

ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని వివిధ కోర్సుల పరీక్షా తేదీలను ఖరారు చేసినట్లు కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ రాములు ఒక ప్రకటనలో తెలిపారు. బీఏఎస్ఎల్‌పీ (సీబీసీఎస్) మూడు, అయిదో సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షలను ఈ నెల 9 నుంచి, ఎంబీఏ (సీబీసీఎస్) రెండు, నాలుగో సెమిస్టర్ మెయిన్, బ్యాక్‌లాగ్, మూడో సెమిస్టర్ బ్యాక్‌లాగ్ పరీక్షలను ఈ నెల 12 నుంచి నిర్వహించనున్నట్లు చెప్పారు.

ఈ చెట్టు కొమ్మ ఎవరిమీద పడేనో..?

విద్యుత్ తీగలపై వేలాడుతున్న ఎండిపోయిన చెట్టు కొమ్మ

మేడ్చల్ కలెక్టరేట్, జూలై 31: విద్యుత్ తీగలపై చెట్ల కొమ్మల వేళాడుతున్న పట్టించుకోవడం లేదు. నాగారం మున్సిపాలిటీ పరిధిలో నెల రోజుల క్రితం విద్యుత్ తీగలకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మలను విద్యుత్ శాఖ అధికారులు తొలగించారు. నాగారం మున్సిపాలిటీ సమీపంలో కత్తిరించిన కొమ్మలు విద్యుత్ తీగలపై అలాగే ఉండిపోయాయి. నిత్యం వేల మంది నడిచే రోడ్డుపై నుంచి వెళ్తున్న విద్యుత్ తీగలపై ఉన్న చెట్ల కొమ్మ గాలికి అటూ ఇటూ ఊగుతుంది. ఎప్పుడైనా కింద పడే పరిస్థితిలో ఉంది. ప్రజలు తిరిగే టప్పుడు మీదపడితే గాయాలు పాలయ్యే అవకాశం ఉంది. అధికారులు నెల రోజులైనా చెట్ల కొమ్మను తొలగించకపోవడం శోచనీయంగా ఉందని అంటున్నారు. వెంటనే ఆ కొమ్మతో పాటు సమీపంలో ఉన్న చెట్లకు నరికి ఉన్న కొమ్మలకు కూడా విద్యుత్ తీగలపైనే ఉన్న కొమ్మను తొలగించాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

మతిస్థిమితం లేని వృద్ధుడు అదృశ్యం

హనుమయ్య(ఫైల్)

మల్కాజిగిరి, జూలై 31: మతిస్థిమితం లేని వృద్ధుడు అదృశ్యమైన సంఘటన మల్కాజిగిరి పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ కథనం ప్రకారం... ఉత్తంనగర్‌కు చెందిన హనుమయ్య (65)గత కొంత కాలంగా మతిస్థిమితం లేక చికిత్స పొందున్నాడు. గతనెల 30న ఉదయం ఇంటి నుంచి బయటకు వెళ్లి రాత్రికి ఇంటికి రాలేదు. దీంతో ఆయన కోసం కుటుంబ సభ్యులు వెతికినా ఆచూకీ దొరకలేదు. దీంతో కూతురు మమత పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఏటీఎం సెంటర్‌లో.. ఎంత హాయో..

మేడ్చల్‌లోని ఓ ఏటీఎం సెంటర్‌లో దర్జాగా నిద్రపోతున్న శునకం

మేడ్చల్, జూలై 31: వినియోగదారుల నుంచి చార్జీలను ముక్కుపిండి వసూలు చేసే బ్యాంకులు ఏటీఎంల నిర్వహణపై దృష్టి పెట్టడం లేదు. సరియైన రక్షణ లేకుండా నిర్వహిస్తూ వినియోగదారులను ఇబ్బందికి గురిచేస్తున్నారు. మేడ్చల్ పట్టణంలో జాతీయ రహదారి పక్కన ఉన్న బ్యాంక్ ఆఫ్ బరోడా బ్యాంకు గేట్ పక్కన ఏర్పాటు చేసిన ఏటీఎం సెంటర్ ద్వారం తెరిచి, అపరిశుభ్రంగా ఉంది.